ప్రజాశక్తి

శుక్రవారం 13 జూన్ 2025



ఆగని అఘాయిత్యాలు..!







◆ ఏడాదిలోపు మూడు ఘటనలు ◆ బాధితులకు అందని చేయూత

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ఉమ్మడి జిల్లాలో మహిళలపై అఘాయిత్యాలు ఆగడం లేదు. కూటమి ప్రభుత్వం అధికారం లోకి వచ్చి ఏడాది కాలంలో చోటు చేసుకున్న తీవ్రమైన నేరాల్లో మూడు ఘటనలున్నాయి. ఇక వెలుగులోకి రాకుండా అత్యాచార యత్నంతో ఆగినవి మరికొన్ని ఉన్నాయి. మహిళలపై జరుగుతున్న హింసను పూర్తిగా లేకుండా చేస్తామని కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాకముందు వాగ్దానాలు చేశారు. ఆచరణలో మాత్రం అఘాయిత్యాలు యథాతథంగా కొనసాగుతూనే ఉండటం గమనార్హం. బాధితులకు సత్వర న్యాయం అటుంచితే... ఆర్థిక తోడ్పాటు అందివ్వడంలోనూ తీరని జాప్యం జరుగుతోంది.

అత్తా కోడళ్లపై దారుణం

గతేడాది అక్టోబర్ 13వ తేదీన శ్రీసత్యసాయి జిల్లా చిలమత్తూరు సమీపంలో ఒక పరిశ్రమ వద్ద కాపాలాగానున్న కుటుంబంపై కొంత మంది యువకులు అర్ధరాత్రి సమయంలో దాడి చేయడమే కాకుండా కుటుంబంలోని ఇద్దరు మహిళలపై అత్యాచారం చేశారు. ఈ దృశ్యాలు సిసి కెమెరాలోనూ నమోదవడంతో పెద్ద కలకలమే రేపింది. వలస కార్మికులుగా వచ్చిన ఆ కుటుంబంపై కుటుంబ సభ్యుల ఎదుటే అత్యాచారం జరిగింది. పోలీసులు రెండు రోజుల వ్యవధిలో నిందితులను పట్టుకున్నారు. పాత నేరస్తులే ఈ ఘటనకు పాల్పడినట్టు తేలింది.

బాలికపై అఘాయిత్యం

శ్రీ సత్యసాయి జిల్లా రామగిరి మండలం ఏడుగుర్రాలపల్లిలో మైనర్ బాలికను రెండు సంవత్సరాలుగా 16 మంది దాక అత్యాచారం చేయడం అందరినీ విస్మయానికి గురిచేస్తోంది. బాలికకు తండ్రి లేకపోవడం, తల్లి మతిస్థిమితం సరిగా లేకపోవడాన్ని అదునుగా చూసుకుని మొదట ఒక యువకుడు లోబరుచుకుని వీడియోలు చిత్రీకరించడం, దాన్ని బయటకు వైరల్ చేయడంతో అది సాకుగా చూపి వరుసగా 16 మంది రెండేళ్లుగా అత్యాచారం జరిపారు. బాలిక గర్భదాల్చి ఆరోగ్యం క్షీణించిన నేపథ్యంలో విషయం వెలుగులోకి వచ్చింది. ఇప్పుడు పోలీసులు నిందితులను గుర్తించి కేసు నమోదు చేసి అరెస్టులు చేశారు.

ఇంటర్ విద్యార్థిని హత్య

అనంతపురం జిల్లా కేంద్రం రామకృష్ణ కాలనీకి చెందిన ఓ యువతి తనను పెళ్లి చేసుకొమ్మని అడిగినందుకు యువకుడు ఆమెను బండరాయితో మోది హత్య చేశాడు. మూడు నెలల క్రితం పరిచయమైన వ్యక్తి పెళ్లి చేసుకుంటానని నమ్మించి, ఆ తరువాత లేదని బుకాయించడంతో యువతి తన్మయి అతనిపై ఒత్తిడి చేసింది. ఈ క్రమంలో ఈనెల 3వ తేదీన నరేష్ ఆమెను ఇంటి నుంచి తీసుకెళ్లి రెండు రోజుల తరువాత హత్య చేశాడు. తల్లిదండ్రులు ఈనెల నాలుగో తేదీనే ఫిర్యాదు చేసినా పోలీసులు అనుకున్నంత వేగంగా స్పందిచకపోవడంతోనే తమ కూతురు మరణించిందని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. ఇలా వరుస ఘటనలు అందరినీ ఆందోళనకు గురి చేస్తున్నాయి.

బాధితులకు అందని తోడ్పాటు

మహిళలపై అత్యాచారం, దాడి జరిగినప్పుడు న్యాయం అందే విధంగా, ఆర్థిక తోడ్పాటును అందించాలని చట్టాలు చెబుతున్నాయి. ఇందుకోసం ప్రత్యేకమైన వ్యవస్థ ఉంది. జరిగిన తీవ్రతను బట్టి రూ.1.50 లక్షల నుంచి రూ.5లక్షల వరకు పరిహారం ఇవ్వాల్సి ఉంది. కాని 2018 నుంచి ఇప్పటి వరకు చాలా వరకు పెండింగులోనున్నాయి. ఉమ్మడి జిల్లాలో 250 మంది వరకు బాధితులకు సహాయం అందాల్సి ఉంది. ఇందులో ఒక్క సత్యసాయి జిల్లా నుంచే 190 వరకు ఉన్నాయి. వీరికి రూ.38 లక్షల వరకు పరిహారం అందాల్సి ఉంది. రూ.13.30 లక్షలు మంజూరయ్యాయి. ఇది 50 మంది బాధితులకు సరిపోయింది. తక్కిన వారు పరిహారం కోసం ఎదురు చూస్తున్నారు. ఎప్పటికి పరిహారం అందుతుందో తెలియని అయోమయ పరిస్థితులు నెలకొన్నాయి.

మహిళల రక్షణకు చర్యలు

తన్మయి ఘటనలో వెంటనే స్పందించాం
మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ రాయపాటి శైలజ



విలేకరులతో మాట్లాడుతున్న మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ రాయపాటి శైలజ

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

మహిళల రక్షణ, భద్రతకు ప్రభుత్వం తరపున అన్ని చర్యలూ తీసుకుంటున్నామని రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ రాయపాటి శైలజ తెలియజేశారు. అనంతపురం, సత్యసాయి జిల్లాలో యువతులపై జరిగిన అఘాయిత్యాలను పరిశీలించేందుకు ఆమె అనంతపురం విచ్చేశారు. గురువారం నాడు అనంతపురం సర్వజన ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఏడుగుర్రాలపల్లి గ్రామానికి చెందిన బాలికను పరామర్శించారు. అనంతరం హత్యకు గురైన తన్మయి కుటుంబాన్ని పరామర్శించారు. అంతకు మునుపు ఆర్‌అండ్‌బి అతిథి గృహంలో మీడిమా సమావేశంలో మాట్లాడారు. విద్యార్థిని తన్మయి హత్యకేసు విచారణ సమయంలో తల్లిదండ్రులు నిందితుడు నరేష్‌ని కాకుండా బాలు అనే మరో వ్యక్తిపై అనుమానం వ్యక్తం చేశారన్నారు. ఇతన్ని పోలీసులు అదే రోజు తీసుకొచ్చి విచారించారన్నారు. అతడికి సంబంధం లేదని తేలడంతో వదిలేశారన్నారు. హత్య అనంతరం నరేష్ పేరు బయటకొొచ్చిందన్నారు. ఇందులో పోలీసుల నిర్లక్ష్యం లేదని స్పష్టం చేశారు. హత్య విషయం బయటకొచ్చాక సిఐ సరైన పద్ధతుల్లో వ్యవహరించకపోవడంతోనే చర్యలు తీసుకున్నట్టు వివరించారు. శ్రీసత్యసాయి జిల్లా రామగిరి మండలం ఏడుగుర్రాలపల్లిలో బాలికపై జరుగుతున్న లైంగిక దాడి రెండేళ్లుగా విషయం బయటకు తెలియలేదన్నారు. బాలికను భయపెట్టడంతో ధైర్యంగా బయటకు చెప్పలేకపోయిందని తెలిపారు. ఆ బాలిక ఏడు నెలల గర్భిణి అయిన తరువాత ఆరోగ్య సమస్యలతో విషయం బయటకొచ్చిందన్నారు. ఇలాంటి ఘటనలపై మహిళలు అప్రమత్తంగా ఉండాలని, వేధింపులు చోటు చేసుకుంటే ధైర్యంగా పోలీసులకు ఫిర్యాదు చేయాలని పేర్కొన్నారు. పోలీసు యంత్రాంగం తక్షణం స్పందించి చర్యలు తీసుకుంటుందని చెప్పారు.

మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్‌కు నిరసన సెగ

దళిత, గిరిజన బాలికలపై జరిగిన అఘాయిత్యాలకు ప్రభుత్వ వైఫల్యమే కారణమని ఎస్సీ,ఎస్టీ సంఘాల నాయకులు ఆర్‌అండ్‌బి అతిథి గృహం వద్ద నిరసన చేపట్టారు. ఛైర్‌పర్సన్ రాయపాటి శైలజ వాహనాన్ని చుట్టుముట్టి ఘెరావ్ చేశారు. దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకున్నామని ఆమె చెప్పే ప్రయత్నం చేసినా నాయకులు వినకుండా వాహనానికి అడ్డంగా నిలబడ్డారు. పోలీసులు కలుగజేసుకుని వారిని పక్కకు తప్పించి ఆమెను ముందుకు వెళ్లేందుకు దారి చూపారు.

నియోజకవర్గ ఏడాది ప్రగతి నివేదిక విడుదల



ప్రగతి నివేదికను విడుదల చేసిన ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు, స్పీకర్

ప్రజాశక్తి-రాయదుర్గం

నియోజకవర్గం పరిధిలో గత ఏడాది కాలంలో జరిగిన అభివృద్ధి పనులకు సంబంధించిన ప్రగతి నివేదికను రాష్ట్ర ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు విడుదల చేశారు. కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో నియోజకవర్గంలో ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు నాయకత్వంలో చేసిన అభివృద్ధి, సంక్షేమం కార్యక్రమాలను పొందుపరుస్తూ రూపొందించిన తొలి ఏడాది ప్రగతి నివేదిక ప్రతులను గురువారం కాలవ అసెంబ్లీలోని స్పీకర్ ఛాంబర్‌లో వైజాగ్ సౌత్ ఎమ్మెల్యే గణబాబు, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవితో కలిసి స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడుతో కలిసి విడుదల చేశారు.

రహదారిపైకి ముళ్లపొదలు



నిజవల్లి-బండిమీదపల్లి గ్రామాల మధ్య పెరిగిన ముళ్లపొదలు

ప్రజాశక్తి-కుందుర్పి

మండలంలోని నిజవల్లి-బండిమీదపల్లి రహదారికి ఇరువైపులా ముళ్లపొదలు ఏపుగా దట్టంగా పెరిగి రోడ్డుపైకి దూసుకొచ్చాయి. దీంతో ఈ మార్గంలో రాకపోకలు సాగించే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రధానంగా మలుపుల్లో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. దీనికితోడు ఎదురుగా వాహనం వస్తే కాస్త పక్కకు వెళ్తే ముళ్ల పొదలు గీసుకుంటున్నాయి. రెండు నెల క్రితం నిజవల్లి గ్రామానికి చెందిన చెప్పుల వ్యాపారి ఈ మార్గంలో వెళ్తుండగా గుర్తు తెలియని వ్యక్తులు దారి కాచి అతడి కళ్లల్లో కారంపొడి కొట్టి దాదాపు రూ. లక్ష నగదు దోచుకోగా బాధితుడు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు కూడా చేశాడు. ఇకనైనా అధికారులు స్పందించి ఈ మార్గంలో ముళ్లపొదలను వెంటనే తొలగించాలని గ్రామ సర్పంచి గౌని ప్రభాకర్‌రెడ్డి, నాగరాజు, తిప్పేస్వామి, కో ఆప్షన్ మెంబర్ ముజువుల్లా కోరుతున్నారు.



అనంతపురంలో ర్యాలీ చేస్తున్న వైసిపి నాయకులు

ప్రభుత్వ నిర్లక్ష్యమే..!

తన్మయి హత్యపై వైసిపి నిరసన - అనంతలో ర్యాలీ

ప్రజాశక్తి -అనంతపురం

కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లనే అనంతపురం గిరిజన విద్యార్థి ఇటీవల దారుణ హత్యకు గురైందని వైసిపి నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. తన్మయి హత్యకు నిరసనగా వైసిపి ఎస్టీ సెల్ ఆధ్వర్యంలో గురువారం నాడు అనంతపురంలో నిరసన చేపట్టారు. ఎస్టీ కమిషన్ మాజీ ఛైర్మన్, ఎమ్మెల్సీ కుంభా రవిబాబు, వైసీపీ అనంతపురం జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి ఈ నిరసన ర్యాలీలో పాల్గొన్నారు. తన్మయి తండ్రి లక్ష్మీపతితో కలిసి ఆర్డీవో మలోలకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కుంభా రవిబాబు మాట్లాడుతూ తన్మయి కన్పించలేదని 3వ తేదీ తల్లిదండ్రులు ఫిర్యాదు చేస్తే పోలీసులు పట్టించుకోలేదన్నారు. సరిగా విచారణ చేయకపోవడంతో విద్యార్థిని హత్యకు గురైందన్నారు. తన్మయి మతదేహానికి రీ పోస్టుమార్టం చేయాలని డిమాండ్ చేశారు. వైసిపి జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో మహిళలు, బాలికలపై అత్యాచారాలు.. హత్యలు జరుగుతుంటే నా వద్ద లాఠీ లేదు.. తుపాకీ లేదంటూ హోం మంత్రి మాట్లాడడం విచారకరం అన్నారు. తన్మయి కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వైసీపీ యువజన విభాగం అనంతపురం జిల్లా అధ్యక్షుడు సాకే చంద్రశేఖర్, వైసీపీ ఎస్టీ సెల్ నాయకులు సాకే శ్రీనివాసులు, గోవింద నాయక్, గుజ్జల శివయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య శ్రీ కార్డులో పేరు నమోదు చేయండి సారూ..!

కిడ్నీ బాధితుడి వేడుకోలు



ఆరోగ్య శ్రీ కార్డులో పేరు చేర్చాలని వేడుకుంటున్న బాధితుడు నాగన్న

ప్రజాశక్తి-యల్లనూరు

ప్రయివేటు వైద్యశాలల్లో చికిత్సలు చేయించుకునేందుకు పేదలకు ప్రభుత్వం ఆరోగ్యశ్రీ కార్డును అమల్లోకి తెచ్చింది. అయితే ఈ కార్డులో పేర్లు లేక కొందరు ఈ అవకాశానికి దూరం అవుతున్నారు. యల్లనూరు మండల కేంద్రానికి చెందిన నాగన్న ఇలాగే కార్డులో పేరులేక ఆయన ఆరోగ్య శ్రీ చికిత్సలకు దూరం అయ్యాడు. తన పేరును ఆరోగ్య శ్రీ కార్డులో చేర్చాలంటూ సంవత్సరాల తరబడి కార్యాలయల చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నా పట్టించుకునే వారు కరువయ్యారు. ఎస్టీ సామజిక వర్గానికి చెందిన నాగన్న యల్లనూరు మండల కేంద్రంలోని పూరె గుడిసెలో నివాసం ఉంటున్నాడు. ఈయనకు రేషన్‌కార్డు ఉంది. ఆరోగ్య శ్రీ కార్డులో పేరు నమోదు కాలేదు. నాగన్న కిడ్నీ సమస్యతో బాధపడుతున్నాడు. ఈ సమస్య తీవ్రం కావడంతో చికిత్స నిమిత్తం అనంతపురంలోని శ్రీనిధి ప్రయివేటు ఆసుపత్రికి వెళ్లాడు. అక్కడ పరీక్షించిన వైద్యులు కిడ్నీలో రాళ్లు ఉన్నాయని చెప్పారు. రాళ్లు తొలగించేందుకు శస్త్ర చికిత్స చేయాలని తెలిపారు. అయితే నాగన్న పేరు ఆరోగ్య శ్రీ కార్డులో లేకపోవడంతో ప్రయివేటు వైద్యశాలలో ఆయనకు ఉచితంగా చికిత్సలు చేసే వీలులేకుండా పోయింది. ఈ పరిస్థితుల్లో తన పేరును ఆరోగ్య శ్రీ కార్డులో చేర్చాలంటూ 10-7-2024న ఆర్డీవోకు వినతి పత్రం అందజేశాడు. అయినా ఇప్పటి వరకు ఈయన సమస్య పరిష్కారం కాలేదు. కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదంటూ నాగన్న ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. ఇప్పటికే కిడ్నీ చికిత్సకు రూ.3లక్షల వరకు ఖర్చు చేశానని, పేదరికంలో ఉన్న తాను అంత డబ్బు వెచ్చించి చికిత్సలు చేయించుకోలేని చెబుతున్నాడు. అధికారులు చొరవ చూపి కార్డులో తన పేరు చేర్చాలనికోరుతున్నాడు.

మార్పులు, చేర్పులకు అవకాశం లేదు.. : ఆర్డీవో

ఈ విషయంపై ఆర్డీవో కేశవనాయుడును వివరణ కోరగా ప్రస్తుతం ఆరోగ్య శ్రీ కార్డులో మార్పులు, చేర్పులకు అవకాశం లేదన్నారు. కొన్నింటికి సంబంధించి వెబ్ పోర్టల్ హోల్డ్‌లో ఉన్నాయన్నారు. అవి అన్ని ప్రీ హోల్డ్ అయిన వెంటనే మార్పులు, చేర్పులకు అవకాశం ఉంటుందని తెలియజేశారు.

ఇకపై డిగ్రీలో రెండు సబ్జెక్టుల పద్ధతి

ప్రజాశక్తి-రాయదుర్గం

ఉన్నత విద్యా శాఖ ఎపి ప్రభుత్వ ఆదేశాల మేరకు 2025-26 విద్యా సంవత్సరం నుంచి డిగ్రీలో రెండు సబ్జెక్టుల పద్ధతిని ప్రవేశపెడుతున్నట్లు పట్టణంలోని కెటిఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.లక్ష్మీనారాయణ తెలిపారు. ఈ విషయంపై గురువారం కళాశాలలో అధ్యాపకులతో సమావేశం నిర్వహించారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ అడ్మిషన్ కోసం విద్యార్థులు కళాశాలలో సంప్రదించాలన్నారు. బి.ఎ డిగ్రీలో భాగంగా ఎకనామిక్స్-పొలిటికల్ సైన్స్, పొలిటికల్ సైన్స్-హిస్టరీ, స్పెషల్ తెలుగు-రూరల్ డెవలప్మెంట్, బీఎస్సీ డిగ్రీలో భాగంగా బాటనీ-కెమిస్ట్రీ, మైక్రోబయాలజీ-బాటనీ, మ్యాథమెటిక్స్- కంప్యూటర్ సైన్స్, ఫిజిక్స్-ఎలక్ట్రానిక్స్, బీకాం డిగ్రీలో బీకాం సి.కామర్స్-కంప్యూటర్ అప్లికేషన్స్, బీకాం- జనరల్ కామర్స్-అకౌంటింగ్ గ్రూపులు ఉన్నాయన్నారు.

16న కృత్రిమ ఉపకరణాల గుర్తింపు శిబిరం

ప్రజాశక్తి-రాయదుర్గం

పట్టణంలోని కణేకల్లు రోడ్డులో ఉన్న మోడల్ స్కూల్ ఆవరణలో ఈ నెల 16వ తేదీ వికలాంగులు, వయోవృద్ధుల గుర్తింపు శిబిరం నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ వి.దివాకర్‌రెడ్డి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. కేంద్ర ప్రభుత్వ సౌజన్యంతో కాన్పూర్‌లోని కృత్రిమ అవయవాల తయారీ సంస్థ వికలాంగులు, వయోవృద్ధులకు కృత్రిమ అవయవాల గుర్తింపు కోసం ఈ శిబిరం నిర్వహిస్తారన్నారు. వికలాంగులు యూడిఐడి కార్డు, ఆధార్ కార్డు, సదరం వైద్య ధ్రువీకరణ పత్రం, రేషన్ కార్డు లేదా ఆదాయ ధ్రువీకరణ పత్రం, 4 ఫొటోలు, మొబైల్ నెంబర్, 2 కాపీల జిరాక్స్ సెట్లు, వయోవృద్ధులు రేషన్ కార్డు, ఆధార్ కార్డు, ఆదాయ ధ్రువీకరణ పత్రం, 4 ఫొటోలు, ఫోన్ నెంబర్, రెండు సెట్ల జిరాక్స్ కాపీలు వెంట తీసుకురావాలన్నారు.

సర్వేపల్లి రాధాకృష్ణ విద్యా మిత్ర కిట్లు పంపిణీ



పుస్తకాలు పంపిణీ చేస్తున్న అధికారులు, ఉపాధ్యాయులు, నాయకులు


ప్రజాశక్తి-బ్రహ్మసముద్రం

మండలంలోని కోనాపురం జడ్పీ హైస్కూల్ వద్ద గురువారం సర్పంచి మల్లెల వనిత మల్లికార్జున ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు సర్వేపల్లి రాధాకృష్ణ విద్యా మిత్ర కిట్లు పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ విద్యార్థులు రోజూ పాఠశాలకు హాజరై ఈ కిట్‌ను సద్వినియోగం చేసుకుని బాగా చదవా లని సూచించారు. కిట్‌లో యూనిఫామ్, బెల్ట్, నోట్ బుక్స్, పాఠ్య పుస్తకాలు, వర్క్ బుక్స్, బ్యాగ్, బూట్లు, సాక్సులు, డిక్షనరీ ఉంటాయన్నారు. ఒక్కో కిట్ కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ. 2,279 ఖర్చు చేస్తోందన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం మల్లికార్జున, ఎస్ఎంసి ఛైర్మన్ సోమశేఖర్, ఉపాధ్యాయులు, నాయకులు ఓబులేష్, నల్లమల్ల, తిప్పేస్వామి, నరసింహులు, కమిటీ సభ్యులు, విద్యార్థులు, పాల్గొన్నారు.

కళ్యాణదుర్గం టౌన్ : ఎంఇఒ-2 బాబు మండలంలోని పలు పాఠశాలలను సందర్శించారు. పట్టణంలోని మోడల్ పాఠశాలలో ప్రిన్సిపల్ నాగరాజు ఆధ్వర్యంలో ఎంఇఒ బాబు, పాటు మార్కెట్ యార్డు వైస్ ఛైర్మన్ కోనంకి రాజశేఖర్ విద్యార్థులకు పాఠ్య, నోట్ పుస్తకాలు, డిక్షనరీలు పంపిణీ చేశారు. మండలంలోని 16 ఉన్నత పాఠశాలలు, 6 ప్రాథమికోన్నత పాఠశాలలు, 62 ప్రాథమిక పాఠశాలల్లో ఆయా ప్రధానోపాధ్యాయులు, ఎస్ఎంసి ఛైర్మన్లు, ప్రజాప్రతినిధుల ఆధ్వర్యంలో పుస్తకాలు పంపిణీ చేశారు. ఎంఇఒ మాట్లాడుతూ ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు మురళి, ఎస్ఎంసి ఛైర్మన్ గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

బొమ్మనహాల్ : మండల వ్యాప్తంగా 40 ప్రభుత్వ, 3 ప్రయివేటు పాఠశాలలు గురువారం నుంచి పున:ప్రారంభమయ్యాయి. అయితే చాలా పాఠశాలల్లో పూర్తి స్థాయిలో విద్యార్థులు హాజరు కాలేదని తెలుస్తోంది. ఎంఇఒ ఈరన్న మాట్లాడుతూ ఇప్పటికే అన్ని ప్రభుత్వ పాఠశాలలకు పాఠ్య, నోటు పుస్తకాలు, దుస్తులు, బూట్లు, సాక్స్ సరఫరా చేశామన్నారు. కొన్ని పాఠశాలల్లో తొలి రోజే వాటిని ఎస్ఎంసి ఛైర్మన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు పంపిణీ చేశారని తెలిపారు.

జెవివి ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం



రక్తదానం చేసిన యువకునికి సర్టిఫికెట్ అందిస్తున్న జెవివి నాయకులు

ప్రజాశక్తి-రాయదుర్గం

జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో గురువారం పట్టణంలోని సమైక్యాంధ్ర భవన్‌లో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది. శిబిరాన్ని మానవతా స్వచ్ఛంధ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు, జెవివి రాష్ట్ర నాయకులు మురళీధర్ ప్రారంభించారు. మానవతా స్వచ్ఛంధ సంస్థ అధ్యక్షులు అమర్నాథ్‌రెడ్డి, జెవివి జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ కెంచే లక్ష్మీనారాయణ, మానవ హక్కుల సంస్థ నాయకులు బాషా, జెవివి అనంతపురం నగర కమిటీ నాయకులు తిరుపాల్ రక్తదానం ఆవశ్యకతను వివరించారు. అనంతరం టిడిపి యువ నేత కాలవ భరత్ రక్తదాతలు, నిర్వాహకులకు జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో జెవివి రాయదుర్గం అధ్యక్షులు వీరన్న, డాక్టర్ శ్రీరామ్‌రెడ్డి, జగదీష్, గౌరవాధ్యక్షుడు అయూబ్‌కాన్, మాంతేష్, చనమల్లప్ప, సిద్దేష్, హరికృష్ణ, మురళి, ఇమ్రాన్, తదితరులు పాల్గొన్నారు.

ఇన్నోవేషన్ సెంటర్‌లో ఏర్పాట్లు పూర్తి చేయండి

జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ



రతన్ టాటా ఇన్నోవేషన్ సెంటర్‌ను పరిశీలించి అధికారులతో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

రతన్ టాటా ఇన్నోవేషన్ సెంటర్‌లో అన్ని ఏర్పాట్లు వెంటనే పూర్తి చేసి సిద్ధం చేయాలని జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం రతన్ టాటా ఇన్నోవేషన్ సెంటర్‌ను ఏర్పాటు చేయనున్న అనంతపురం నగరంలోని జేఎన్టీయూ అడ్మిన్ బిల్డింగ్‌లో ఏర్పాట్లను జాయింట్ కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ వర్చువల్ విధానంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రతన్ టాటా ఇన్నోవేషన్ సెంటర్‌ను ప్రారంభించే అవకాశం ఉందని, జేఎన్టీయూ అడ్మిన్ బిల్డింగ్‌లో రతన్ టాటా ఇన్నోవేషన్ సెంటర్ ప్రారంభం కోసం అన్ని రకాల ఏర్పాట్లను వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌అండ్‌బి ఎస్ఈ వి.రాజగోపాల్, జిల్లా స్కిల్ డెవలప్మెంట్ అధికారి ప్రతాపరెడ్డి, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి శ్రీనివాస యాదవ్, ఏడీ రాజశేఖర్ రెడ్డి, ఆర్‌అండ్‌బి డిఈ బాల కాటమయ్య, ఏఈలు, పాల్గొన్నారు.

ఓటర్ల జాబితాలో పారదర్శకత పాటించాలి

ప్రజాశక్తి-రాయదుర్గం

ఓటరు జాబితా రూపకల్పనలో పారదర్శకత పాటించాలని ఎలక్ట్రోరల్ రిజిస్ట్రింగ్ ఆఫీసర్ ఎన్.రవిశంకర్‌రెడ్డి ఆదేశించారు. నియోజకవర్గ పరిధిలో ఓటర్ల జాబితా రూపకల్పనపై గురువారం ఈఆర్ఒ స్థానిక తహశీల్దార్ కార్యాలయ ఆవరణలో తహశీల్దార్లు, ఎన్నికల అధికారులు, వివిధ రాజకీయ పార్టీ ప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈఆర్ఒ మాట్లాడుతూ ఓటర్ల జాబితా అనేది నిరంతరం జరిగే ప్రక్రియ అని, సక్రమంగా రూపొందించాలన్నారు. వచ్చే ఏడాది స్థానిక సంస్థల ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఆయా పంచాయతీలు, మున్సిపాలిటీల పరిధిలో ఓటర్ల జాబితాను ఎన్నికల అధికారులు ఎప్పటికప్పుడు సక్రమంగా నిర్వహించాలన్నారు. ప్రతినెలా కొత్తగా ఓటర్ల నమోదు కోసం 200 దరఖాస్తులు వస్తున్నట్లు తెలిపారు. రాయదుర్గం తహశీల్దార్ నాగరాజు మాట్లాడుతూ గతేడాది డెత్ క్లెయిమ్ దరఖాస్తులు 700కు పైగా పరిష్కరించినట్లు తెలిపారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు మాట్లాడుతూ పట్టణంలోని 12వ వార్డులో ఓ పోలింగ్ కేంద్రానికి సంబంధించి నాలుగు వేర్వేరు ప్రాంతాల్లో ఓటర్లు ఉండగా వారు పోలింగ్ కేంద్రానికి రావడానికి దూరం అవుతుందన్నారు. అలాంటి వాటిని గుర్తించి 2 కిలోమీటర్ల లోపు పోలింగ్ కేంద్రం ఉండేలా విభజన చేయాలని కోరారు.

విత్తన వేరుశనగను సద్వినియోగం చేసుకోండి

బ్రహ్మసముద్రం : రాష్ట్ర ప్రభుత్వం రాయితీపై అందిస్తున్న విత్తన వేరుశనగను రైతులు సద్వినియోగం చేసుకో వాలని సర్పంచి మల్లెల వనితామల్లికార్జున సూచించారు. మండలంలోని సంతే కొండాపురం పంచా యతీ పరిధిలోని సూగేపల్లి, కోనాపురం గ్రామాల రైతులకు గురువారం సర్పంచి రైతు సేవా కేంద్రం వద్ద విత్తన వేరుశెనగను పంపిణీ చేశారు. కార్యక్రమంలో అగ్రికల్చర్ అసిస్టెంట్ ముజాహిద్, నాయ కులు ఓబులేసు, మార్కెట్ యార్డ్ మెంబర్ విరూపాక్షి, డీలర్లు శీనప్ప, నల్లమల్ల, చల్లమల్ల, నాయకులు సోమశేఖర్, తిప్పేస్వామి, నరసింహులు, మంజు, హనుమంతరాయుడు, రైతులు పాల్గొన్నారు.

కళ్యాణదుర్గం ఏవోగా శ్రావణ్‌కుమార్



ప్రజాశక్తి-కళ్యాణదుర్గం టౌన్

మండల వ్యవసాయ శాఖ అధికారిగా శ్రావణ్‌కుమార్ గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న ఏవో జగదీష్ కణేకల్లు మండలానికి బదిలీ కాగా, కణేకల్లులో పనిచేస్తున్న శ్రావణ్‌కుమార్ ఇక్కడికి వచ్చారు. అలాగే ఇక్కడ ఎఇఒగా పనిచేస్తున్న దిలీప్‌కుమార్ కూడేరు మండలానికి బదిలీపై వెళ్లగా అదే మండలంలో ఎఇఒగా పనిచేస్తున్న విజయ్‌కుమార్ ఇక్కడికి వచ్చారు.

విమాన పమ్రాదంపై ఎమ్మెల్యే దిగ్భ్రాంతి

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం టౌన్

గుజరాత్ రాష్ట్రంలోని అహ్మదాబాద్‌లో గురువారం జరిగిన విమాన ప్రమాదం ఘటనపై ఎమ్మెలే అమిలినేని సురేంద్రబాబు ఓ ప్రకటనలో తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. ఆ ప్రమాదాంలో గుజరాత్ మాజీ ముఖ్యమంత్రి విజయ్‌రూపాళి మృతి చెందడం పట్ల ఆవేదన వ్యక్తంచేశారు. సుమారు 200 మందికి పైగా ప్రయాణికులు, సిబ్బంది చనిపోవడం దురదృష్టకరమన్నారు. మాజీ సీఎంతో పాటు మృతుల కుటుంబాలకు ఎమ్మెల్యే ప్రగాఢ సానుభూతి తెలిపారు. వారి ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు.

టిడిపి విజయోత్సవ ర్యాలీ రద్దు

కూటమి పభ్రుత్వం ఏర్పడి ఏడాదైన సందర్భంగా శుక్రవారం పట్టణంలో నిర్వహించాల్సిన విజయోత్సవ బైక్ ర్యాలీని రద్దు చేసినట్లు ప్రజావేదిక కార్యాలయం నుంచి ఓ ప్రకటన విడుదల చేశారు. విజయోత్సవ ర్యాలీ తేదీని మళ్లీ ప్రకటిస్తామని తెలిపారు.

వేరుశనగ కాయలు పంపిణీ



విత్తనకాయలను పంపిణీ చేస్తున్న గుమ్మనూరు నారాయణస్వామి

ప్రజాశక్తి-గుంతకల్లు రూరల్

మండల పరిధిలోని దోసలోడికి గ్రామంలో ప్రభుత్వం సబ్సిడీపై అందిస్తున్న వేరుశనగ కాయలను గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జయరామ్ సోదరుడు నారాయణస్వామి మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వం రైతులను తీవ్ర నిర్లక్ష్యం చేసి వ్యవసాయ రంగాన్ని తీవ్ర నిర్లక్ష్యం చేసిందన్నారు. అయితే సిఎం చంద్రబాబు సారథ్యంలో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం రైతాంగాన్ని ఆదుకునేందుకు అనేక చర్యలు చేపట్టిందన్నారు. ఇందులో భాగంగానే వేరుశనగ కాయలు 40శాతం రాయితీతో అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి వాల్మీకి మాధవి, జడ్పిటిసి కదిరప్ప, మాజీ ఎంపిపి రాయల్ రామయ్య, మాజీ మార్కెట్ యార్డు ఛైర్మన్ గుమ్మనూరు వెంకటేష్, టిడిపి నాయకులు పాత కొత్తచెరువు గోపాల్, పాల మల్లికార్జున, బండారు ఆనంద్, కందుల ప్రసాద్‌రెడ్డి, నాయకులు జిలకర సుధాకర్, కటారి సురేష్, జిలకర శివమూర్తి, అధికారులు, రైతులు పాల్గొన్నారు.

పామిడి : మండలంలోని దేవరపల్లి గ్రామంలో మండల వ్యవసాయ అధికారిణి లీనా వసుంధర ఆధ్వర్యంలో గురువారం సబ్సిడీ విత్తన వేరుశనగ కాయలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పామిడి, గుత్తి మండలాల టిడిపి ఇన్‌ఛార్జి గుమ్మనూరు ఈశ్వర్, మండల నాయకులు కత్రిమల ప్రభాకర్‌చౌదరి, బొల్లు శ్రీనివాస్‌రెడ్డి, ముసిలిరెడ్డి, సుంకిరెడ్డి, నగేష్, దేవదాస్, వెంకటేష్, లక్ష్మీనారాయణ, కాయల మహేష్, చంద్ర, రైతు సేవా కేంద్రం విఎస్‌ఎ నారాయణస్వామి, ఎంపిఇఒ రామాంజనేయులు, దేవరపల్లి సచివాలయ సిబ్బంది, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

సాగు, వ్యవసాయ పథకాలపై అవగాహన



కార్యక్రమంలో మాట్లాడుతున్న శాస్త్రవేత్త

ప్రజాశక్తి-శింగనమల

వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమంలో రెడ్డిపల్లి కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో గురువారం మండల పరిధిలోని పెరవలి, నాగులగుడ్డం తండా గ్రామాల్లో సాగుతోపాటు వ్యవసాయ పథకాలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రేకులకుంట శాస్త్రవేత్త నారాయణస్వామి మాట్లాడుతూ వ్యవసాయ రంగంలో అధిక మోతాదులో ఉపయోగించే ఎరువులు, పురుగు మందులకు స్వస్తి చెప్పి సాగులో వైవిధ్యతను ప్రోత్సహించాలని సూచించారు. అలాగే నూతన పద్ధతులు, వంగడాల విషయాలు, డ్రోన్ స్ప్రేయింగ్ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎంఎస్ సుధ, మండల వ్యవసాయ అధికారి అన్వేష్‌కుమార్, పశు వైద్య అధికారి డాక్టర్ కిరణ్‌కుమార్‌రెడ్డి, మౌనప్రియ, వ్యవసాయ విస్తరణ అధికారిణి విశ్వేశ్వరి, రాచేపల్లి, సలకంచెరువు, శింగనమల, ఉల్లికల్లు రైతు సేవాకేంద్రం అధికారులు, విజయభార్గవి, అనూషా, పవన్‌కుమార్, విజయ్, ఫయాజ్, ఉమాదేవి, సంధ్యారాణి, అమరేష్, చంద్రకళ, అఖిల, వీరనరమ్మ, నవీన్, రైతులు పాల్గొన్నారు.

దినచర్యలో యోగా భాగం కావాలి

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

ప్రతి ఒక్కరూ తమ దినచర్యలో యోగా చేయడం అలవాటుగా చేసుకోవాలని డిఎంహెచ్ఒ ఇబి దేవి సూచించారు. గురువారం బుక్కరాయసము ద్రం మండలంలోని జంతలూరు వద్ద ఉన్న 14వ బెటాలియన్ ప్రాంగణంలో యోగాం ధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సంద ర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకొచ్చిన యోగాంధ్ర కార్యక్ర మంలో ప్రజలు అందరూ భాగస్వాములై విజయ వంతం చేయడం సంతోషకరమన్నారు. ప్రజలంద రూ యోగా చేస్తే రోగాలు దరిచేరవన్నారు. ఈ కార్య క్రమంలో 14వ బెటాలియన్ కమాండెంట్ ప్రభు కుమార్, అడిషనల్ కమెండెంట్ కేశవరెడ్డి, డిఎస్పీలు ప్రసాద్‌రెడ్డి, వెంకటశివారెడ్డి, మహబూబ్‌బాషా, ఇన్స్‌పెక్టర్ నాగేంద్ర, బెటాలియన్ వైద్యాధికారి ఆది శేషు, ఆయూష్ అధికారులు రామ్‌కుమార్, లాల్యా నాయక్, యోగా గురువులు కృష్ణవేణి, గురురాజా, డెమో త్యాగరాజ్, ఆరోగ్య బోధన అధికారి గంగాధర్, పతంజలి రవికుమార్, గోవిందరెడ్డి, శర్మ, బెటాలి యన్ సిబ్బంది పాల్గొని యోగాసనాలు వేశారు.

జలశక్తి అభియాన్ సభ్యుల పర్యటన



మున్సిపల్ ఛైర్మన్ జేసి ప్రభాకర్‌రెడ్డితో జలశక్తి అభియాన్ సభ్యులు

ప్రజాశక్తి-తాడిపత్రి

కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించు 6వ జాతీయ జల అవార్డు-2024 నామినేషన్ కోసం తాడిపత్రి పురపాలక సంఘం తరపున దరఖాస్తు చేసుకున్న నేపథ్యంలో దాఖలు చేసిన నామినేషన్ వివరాలను ప్రామాణికంగా పరిశీలించేందుకు జలశక్తి అభియాన్ విభాగం తరపున శాస్త్రవేత్త వైష్ణవి పరిహార్, సిడబ్ల్యుసి డిపార్టుమెంట్ ఇంజనీర్ బి.నాగరాజు గురువారం తాడిపత్రి పట్టణాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా వారు పట్టణంలోని రెయిన్ వాటర్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్లు, లిక్విడ్ వెస్ట్ మేనేజ్‌మెంట్, మంచినీటి సరఫరా, చెట్ల నాటకం తదితర అంశాలపై వివిధ ప్రాంతాలలో నేరుగా పర్యవేక్షణ జరిపారు. తదనంతరంగా వారు తాడిపత్రి మునిసిపల్ ఛైర్మన్ జెసి ప్రభాకర్‌రెడ్డిని కలిసి పట్టణంలో చేపడుతున్న బల పరిరక్షణ చర్యలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎస్.శివరామకృష్ణ, అసిస్టెంట్ ఇంజినీర్ సన్నితేజ, అసిస్టెంట్ ఇంజినీర్ ఏకనాథ్, తదితరులు పాల్గొన్నారు.

'అంగన్వాడీ పిలుస్తోంది'



పిల్లలతో అక్షరాభ్యాసం చేయిస్తున్న అంగన్వాడీ టీచర్లు

ప్రజాశక్తి-పామిడి

స్థానిక మంజునాథ టాకీస్ అంగన్వాడీ సెంటర్, 4వ అంగన్వాడీ సెంటర్‌లో గురువారం అంగన్వాడీ పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా సరస్వతి పూజతోపాటు చిన్నారులతో అక్షరాభ్యాసం చేయించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్‌వైజర్ రామలక్ష్మి, అంగన్వాడీ టీచర్లు జయంతి, సేకున్‌బి, భారతి, త్రివేణి, యశోద, జెఎల్ నారాయణమ్మ, రజియా, జ్యోతి, హెల్పర్లు మాబున్నీ, కీర్తి, తదితరులు పాల్గొన్నారు.

నార్పల : మండల కేంద్రంలోని సుల్తాన్ పేట అంగన్వాడీ కేంద్రంలో సిడిపిఒ భారతి ఆదేశాల మేరకు సూపర్‌వైజర్ సునాలిని ఆధ్వర్యంలో గురువారం అంగన్వాడీ పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు పరిధిలోని సూపర్‌వైజర్లు, ప్రాజెక్టు కోఆర్డినేటర్, అంగన్వాడీ కార్యకర్తలు, చిన్నారులు, తల్లులు, తదితరులు పాల్గొన్నారు.

పెద్దవడుగూరు : ప్రతి చిన్నారినీ అంగన్వాడీ కేంద్రాల్లో చేర్పించాలని ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు నాగేశ్వరి, వెంకటలక్ష్మి సూచించారు. అంగన్వాడీ పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా గురువారం మండలంలోని పలు గ్రామాల్లో చినారులతో అక్షరభ్యాసం చేయించారు.

పుట్లూరు : మండల పరిధిలోని కుమ్మనమల అంగన్వాడీ కేంద్రంలో గురువారం సామూహిక అక్షరాభ్యాసం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిడిపిఒ భారతి, అంగన్వాడీ టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.

గుమ్మఘట్ట : మండలంలోని జాలివంక గ్రామంలో ఉన్న అంగన్వాడీ కేంద్రంలో ఐసిడిఎస్ సూపర్‌వైజర్ జ్యోతి అధ్వర్యంలో అంగన్వాడీ పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీలు రాధిక, నాగమణి, వరలక్ష్మి, శోభారాణి, హేమలత, ఆయాలు, పిల్లలు పాల్గొన్నారు.

'పిల్లల చేతుల్లో పుస్తకం ఉండాలి '

ప్రజాశక్తి-అనంతపురం

పిల్లల చేతుల్లో పనిముట్లు కాకుండా పుస్తకాలు ఉండాలని డిసిఎల్ లక్ష్మినరసయ్య పేర్కొన్నారు. బాల కార్మిక వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం నాడు 'రెడ్స్' స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం జరిగింది. షికారి కాలనీలో బడి బయట పిల్లలను గుర్తించి వారిని బడిలో చేర్పేందుకు తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. కార్మిక శాఖ ద్వారా ఆ కాలనీల్లో ఉన్న బట్టీల్లో పనిచేసే వారికి ఈ-శ్రమ్ పోర్టల్ గురించి అవగాహన కల్పించడంతోపాటు ఈ -శ్రమ్ కార్డు క్యాంపెయిన్ ఏర్పాటు చేస్తామని తెలిపారు. డిసిఎల్ ఆధ్వర్యంలో బాల కార్మిక వ్యతిరేక దినోత్సవం పోస్టరును విడుదల చేశారు. ఈ సందర్భంగా రెడ్స్ సంస్థ ప్రతినిధి భానుజ మాట్లాడుతూ రెడ్స్ సంస్థ ద్వారా జిల్లాలో 138 మంది బాల కార్మికులను గుర్తించి రెస్క్యూ చేశారు. ఆధార్ కార్డు లేకుండావున్న పిల్లలకు ఆధార్‌కార్డు ఇప్పించే కార్యక్రమం కూడా చేపట్టడం జరుగుతోందని వివరించారు. ఈ కార్యక్రమంలో ఎఎల్ఒ సుజాత, ప్రతాప్ నాయుడు, రవీంద్రనాథ్, పోలీసు శాఖ నుంచి రంగస్వామి, డిఎల్ఎస్ఎ ప్రభాకర్, విద్యా శాఖ నుంచి సిఆర్‌పి రామకృష్ణ, చైల్డ్ లైన్ నుంచి సంధ్య, సాయంత్రం కళ్యాణదుర్గం ప్రాంతంలో జరిగిన కార్యక్రమంలో సిఐ యువరాజు, ఎంఆర్ఒ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

రహదారిపై వంతెనలకు మోక్షం

రూ.6 కోట్లతో సాగుతున్న పనులు - రెండు నియోజకవర్గాల గ్రామాల ప్రజలకు తీరనున్న కష్టాలు



బ్రాహ్మణపల్లికి వెళ్లే రోడ్డు వద్ద జరుగుతున్న వంతెన నిర్మాణం పనులు

ప్రజాశక్తి-గుత్తి

గుంతకల్లు, ఉరవకొండ నియోజకవర్గాల్లోని పలు గ్రామాలకు వెళ్లే రహదారిపై వంతెనల నిర్మాణం పనులు వేగవంతంగా సాగుతున్నాయి. ముఖ్యంగా గుత్తి మండలంలోని నాగసముద్రం రోడ్డు బాగుపడనుంది. గుత్తి మండలం నుంచి గుంతకల్లు మండలం మీదుగా ఉరవకొండ నియోజకవర్గంలోని వజ్రకరూరు మండలంలో పలు గ్రామాలకు వెళ్లే రహదారిలో వంకలు ఉండడం వల్ల గ్రామీణ ప్రాంతాల ప్రజలు, ప్రయాణికులు ఇబ్బందులు పడేవారు. వర్షాకాలంలో వంకలు పొంగి పారుతుండడంతో గ్రామీణ ప్రాంతాల ప్రజలు, ప్రయాణికులు గంటల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. ముఖ్యంగా గుత్తి మండలంలోని పెద్దొడ్డి, పి.ఎర్రగుడి, బ్రాహ్మణపల్లి, పూలకుంట, గుంతకల్లు మండలంలోని నాగసముద్రం, గుర్రప్పాడు, తదితర గ్రామాలతో పాటు వజ్రకరూరు మండలంలోని పలు గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడేవారు. 50 ఏళ్లుగా సమస్య ఉండేది. సమస్యను గుర్తించిన పంచాయతీ రాజ్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ డి.ఎల్.మురళీధర్ రహదారిపై వంతెనల నిర్మాణం కోసం ప్రభుత్వానికి నిధులు కోసం ప్రతిపాదనలు పంపారు. దీంతో రూ.6 కోట్లు నిధులు మంజూరయ్యాయి. ప్రస్తుతం గుత్తి మండలం పెద్దొడ్డి గ్రామ సమీపంలోని వంక వద్ద వంతెన నిర్మాణానికికి దాదాపు రూ.3.20 కోట్లు వెచ్చించి చేపట్టిన పనులు చురుగ్గా జరుగుతున్నాయి. బ్రాహ్మణపల్లి వెళ్లే రహదారి వంక వద్ద వంతెన నిర్మాణం కోసం రూ.2.80 కోట్లు వ్యయం చేసి చేస్తున్న పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. రహదారిపై వంతెనల నిర్మాణం పనులను కాంట్రాక్టర్ రంగారెడ్డి చురుగ్గా చేయిస్తున్నారు. పంచాయతీరాజ్ శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ డిఎల్.మురళీధర్, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మల్లేష్ నాయక్ పర్యవేక్షణలో పనులు సాగుతున్నాయి. పనులు నాణ్యతగా ఉండేందుకు పటిష్టంగా చర్యలు చేపట్టామన్నారు.త్వరలో పనులు పూర్తవుతాయని వారు చెబుతున్నారు. వంతెన నిర్మాణాలు పూర్తవుతే ఆయా గ్రామాల ప్రజలు, ప్రయాణికుల కష్టాలు తీరనున్నాయి.

విద్యార్థి మిత్ర కిట్లు పంపిణీ



కక్కలపల్లిలో విద్యార్థులకు కిట్లు పంపిణీ చేస్తున్న ఉపాధ్యాయులు, నాయకులు

ప్రజాశక్తి-అనంతపురం

అనంతపురం రూరల్ మండలం కక్కలపల్లి ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు గొర్తి వెంకట్ అధ్యక్షతన విద్యార్థులకు సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర కిట్లను గురువారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచు కృష్ణయ్య, పాఠశాల యాజమాన్య కమిటీ ఛైర్మన్ టి.అనీలా, ఎంపిటిసి కె.ఓబులేసు, ఎస్ఎంసి సభ్యులు బి.శివశంకర్, తల్లిదండ్రులు టి.బొమ్మయ్య, సుధాకర్, గ్రామ పెద్ద బయ్యప్ప, టీచర్లు వి.అలివేలమ్మ, సిఎస్ విక్టోరియా, వై.సుశీల, సౌజన్య, మాజీ సర్పంచు పి.శంకర, పూజారి కొండన్న, పి.సుధాకర్, మధు, వన్నూరప్ప, నాగేంద్ర, ప్రకాష్, పలమారి శీన, తిరుమల, జూటూరు ప్రకాష్, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

నార్పల : మండల కేంద్రంలోని మహాత్మ జ్యోతిబా పూలే గురుకుల పాఠశాల విద్యార్థులకు గురువారం డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర కిట్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ వైస్ ఛైర్‌పర్సన్ నాగరత్నమ్మ, ఎంపిడిఒ మమతాదేవి, పాఠశాల ప్రిన్సిపాల్ సంగీతకుమారి, స్కూల్ కమిటీ ఛైర్మన్ కుమార్, స్కూల్ కమిటీ వైస్‌ఛైర్మన్, ఎంపిటిసి భాగ్యలక్ష్మి, పాఠశాల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పెద్దవడుగూరు : పాఠశాలల పున:ప్రారంభం సందర్భంగా పెద్దవడుగూరులోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం విద్యామిత్ర కిట్ల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి యువ నాయకులు చిన్నవడుగూరు దివాకర్‌రెడ్డి, కేశవరెడ్డి, బాలిరెడ్డి, నారాయణస్వామి, కృష్ణారెడ్డి, ఎంఇఒలు రాముడు, గురుప్రసాద్, ప్రధానోపాధ్యాయుడు సుధాకరబాబు పాల్గొన్నారు.

పామిడి : మండల కేంద్రంలోని ఎపి మోడల్ స్కూల్‌లో విద్యార్థులకు గురువారం సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర కిట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పామిడి, గుత్తి మండలాల టిడిపి ఇన్‌ఛార్జి గుమ్మనూరు ఈశ్వర్, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ అరుణ, టిడిపి సీనియర్ నాయకులు ప్రభాకర్‌చౌదరి, జింకల సంజీవకుమార్, బొల్లు శ్రీనివాస్‌రెడ్డి, ముసిలిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బెలుగుప్ప : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర కిట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకట ప్రసాద్, స్కూల్ పాఠశాల స్కూల్ కమిటీ ఛైర్మన్ డి.రుద్రయ్య పాల్గొన్నారు.

యల్లనూరు : మండల పరిధిలోని వెన్నపూసపల్లి యల్లనూరు, జిల్లా ఉన్నత పాఠశాలల్లో గురువారం విద్యార్థి మిత్ర కిట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండలాధ్యక్షురాలు గంగాదేవి, జడ్పిటిసి భోగాతి విజయ్‌ప్రతాప్‌రెడ్డి, ఎంఇఒలు చంద్రశేఖర్, పరమేశ్వరరెడ్డి, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం

టిడిపి సంబరాలు



పెద్దవడుగూరులో సంబరాలు చేసుకుంటున్న టిడిపి నేతలు

ప్రజాశక్తి-శింగనమల

ముఖ్యమంత్రి చంద్రబాబు తోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని టిడిపి మండల కన్వీనర్ గుత్తా ఆదినారాయణ అన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరం పూర్తయిన సందర్భంగా మండల కేంద్రంలో సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వంలో సంక్షేమం, అభివృద్ధి మరుగున పడిందన్నారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారం లోకి వచ్చాక పేదల సంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నా మన్నారు. ముఖ్యంగా రైతులకు సబ్సిడీ విత్తనాలతోపాటు వ్యవసాయ పరికరాలు అందజేస్తున్నట్లు తెలిపారు. వీటితోపాటు అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు లాయర్ ఈశ్వర్‌రెడ్డి, శాలినీదొర, చిదంబరదొర, గోరంట్ల మారుతీనాయుడు, సి.వెంక టేశు, మాసూలు చంద్రమోహన్, గుర్రం లక్ష్మీనారాయణ, ఆయక ట్టు ఛైర్మన్ బోయ సత్యనారాయణ, మట్లగొంది సర్పంచు రమేష్, బ్యాళ్ల సుదర్శన్, అట్టే శ్రీనివాసులు, మట్లగొంది అనిల్, అట్టే రామాంజనేయులు, కొయ్యగూర పెద్దన్న, డీలర్లు సత్యనారాయణ, శివ, మహబూబ్‌బాషా, చిన్నజలాలపురం సుధాకర్, వెంకటరమ ణ, నాగరాజు, ఆంజనేయులు, వీరాంజనేయులు, బాషా, కూరాకు రాముడు, హనుమంతు, తదితరులు పాల్గొన్నారు.

పెద్దవడుగూరు : కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఏడాది పాలన కావడంతో గురువారం పెద్దవడుగూరులోని టిడిపి కార్యాలయంలో గురువారం సంబరాలు చేసుకున్నారు. ఇందులో భాగంగా కేక్ కోసి పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ కొండూరు కేశవరెడ్డి, నాయకులు ఆవులాంపల్లి కేశవరెడ్డి, బాలిరెడ్డి, దివాకరరెడ్డి, నారాయణస్వామి, చిరంజీవులు తదితరులు పాల్గొన్నారు.

యాడికి : కూటమి పాలన అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయిన సందర్భంగా టిడిపి మండల కన్వీనర్ గొర్తి రుద్రమనాయుడు ఆధ్వర్యంలో గురువారం సంబరాలు చేసుకున్నారు. ముందుగా ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం విజయోత్సవ సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు మధురాజు, బొట్టు శేఖర్, పరిమి శ్రీహరి, ఆదినారాయణ, నరసింహచౌదరి, నీలకంఠ, పామిశెట్టి గోపి, పాల నారాయణస్వామి, స్టోర్ డీలర్లు సూర్యనారాయణ, సుధాకర్ రెడ్డి, ఆదినారాయణ, పచ్చా నారాయణస్వామి, నంద్యాల రంగస్వామి, సుభాన్, చంద్ర, వెంకటేష్, బాలు, తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకుంటున్న 'రైలు రెస్టారెంట్'

'ప్రగతీ'స్ రైల్ కోచ్ సంస్థ నిర్వాహకులు హనుమంతురెడ్డి, రవికుమార్



ప్రగతీ'స్ రైల్‌కోచ్ రెస్టారెంట్, సౌకర్యాలు, నిర్వాహకులు

ప్రజాశక్తి-అనంతపురం

అనంతపురం రైల్వేస్టేషన్ ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన ప్రగతీ'స్ రైల్ కోచ్ రెస్టారెంట్ అనంతవాసులను ఆకట్టుకుంటోంది. ఈ సందర్భంగా సంస్థ నిర్వాహకులు హనుమంతురెడ్డి, రవికుమార్ మాట్లాడుతూ రైల్వేస్టేషన్ ప్రాంగణంలో సువిశాలమైన ప్రగతీ'స్ రైల్ కోచ్ రెస్టారెంట్‌ను ప్రజలు ఎంతగానో ఆదరిస్తున్నారని తెలిపారు. తమ వినూత్నమైన ఆలోచనకు ప్రజల నుంచి అపూర్వ స్పందన వస్తోందన్నారు. రైల్వేస్టేషన్ పూర్తిస్థాయిలో నిర్మాణం పూర్తయితే మరింత ప్రజాదరణ పొందే అవకాశం ఉందన్నారు. రైల్ కోచ్ రెస్టారెంట్లో రైలు కోచ్‌లో సుమారుగా 60 మంది వరకూ కూర్చోవచ్చన్నారు. ఇదే క్రమంలో రెస్టారెంట్లో సుమారుగా 200 మందికిపైగా కూర్చొని విందు ఆరగించేందుకు ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. నిష్ణాతులైన మాస్టర్ చెఫ్‌లు, సప్లయర్స్‌ను నియమించినట్లు చెప్పారు. చిన్నపాటి ఫంక్షన్‌లు, పుట్టిన రోజు వేడుకలు చేసుకునేందుకు సువిశాలమైన ప్రాంగణం అందరికీ స్వాగతం పలుకుతుందన్నారు. వెజ్, నాన్ వెజ్, స్నాక్స్ ఐటమ్స్ అన్ని రకాల ఐటమ్స్ రుచికరంతో అందిస్తున్నట్లు చెప్పారు. అందరికీ అందుబాటు ధరలు నిర్వహించడంతో ప్రజల నుంచి విశేషమైన ఆదరణ లభిస్తుందన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గాలివానకు పడిపోయిన విద్యుత్ స్తంభాలు



పడిపోయిన విద్యుత్ స్తంభాలు

ఉరవకొండ : బుధవారం రాత్రి నుంచి కురిసిన గాలివాన వర్షాలకు ఉరవకొండ మండల పరిధిలోని నింబగల్లు గ్రామ చెరువు దగ్గర ఉన్న రెండు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లుతోపాటు రెండు విద్యుత్ స్తంభాలు గురువారం పడిపోయాయి. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు పడిపోవడంతో చెరువులో నుండి పంపింగ్ ఆగిపోయింది. పంపింగ్ ఆగిపోవడంతో ఆ చెరువు నుంచి ఉరవకొండతో పాటు వ్యాసాపురం, నింబగల్లు, రేణుమాకులపల్లి, రాయంపల్లి, తదితర గ్రామాలకు తాగునీరు సరఫరా ఆగిపోయింది.

అనంతపురం ఎఒగా వెంకటకుమార్ బాధ్యతల స్వీకరణ



అనంతపురం : అనంతపురం మండల వ్యవసాయ అధికారిగా ఎ.వెంకటకుమార్ గురువారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల పరిధిలోని రైతులకు నాణ్యమైన ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు అందించేందుకు కృషి చేస్తామన్నారు. అలాగే జిల్లాకేంద్రంలో ఉన్న ఎరువులు దుకాణాలను ఎప్పటికప్పుడు తనిఖీ చేసి రైతులకు నాణ్యమైన ఉత్పత్తులు అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. దుకాణాల డీలర్లు తప్పనిసరిగా ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే రైతులకు ఉత్పత్తులు అమ్మకాలు చేయడంతోపాటు తప్పనిసరిగా బిల్లులు అందజేయాలన్నారు. అనంతరం ఎఒకు ఎఇఒ మురళీకృష్ణ, రైతు సేవాకేంద్రాల సిబ్బంది, డీలర్లు శుభాకాంక్షలు తెలిపారు.

రేపు విద్యుత్ సరఫరాలో అంతరాయం

యల్లనూరు : మండలంలోని కోమటికుంట్ల విద్యుత్ సబ్‌స్టేషన్‌లో 132 కెవి లైన్ మరమ్మతుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు తాడిపత్రి సబ్ డివిజన్ అధికారి సిసిఒ, ఎడిఇడి వసంతయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 7 నుంచి 11 గంటల వరకూ పుట్లూరు, యల్లనూరు మండలాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. కావున విద్యుత్ వినియోగదారులు, ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

యల్లనూరు డిప్యూటీ తహశీల్దార్‌గా రాము



యల్లనూరు : యల్లనూరు మండల డిప్యూటీ తహశీల్దార్‌గా వి.రాము గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన ఉరవకొండ నుంచి బదిలీపై యల్లనూరుకు వచ్చారు. డిటీతోపాటు అదనంగా సిఎస్‌డిటి బాధ్యతలు అప్పగిస్తూ జిల్లా అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.

పుట్లూరు డిప్యూటీ తహశీల్దార్‌గా మహబూబ్‌బాషా



పుట్లూరు : మండల డిప్యూటీ తహశీల్దార్‌గా మహబూబ్‌బాషా గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేసిన మల్లేష్‌ప్రసాద్ తాడిపత్రి సిఎస్‌డిటిగా బదిలీ కావడంతో యల్లనూరులో ఉంటూ సెలవుపై ఉన్న మహబూబాసాను పుట్లూరు డిప్యూటీ తహశీల్దార్‌గా బదిలీ నియమించారు. దీంతో ఆయన బాధ్యతలు స్వీకరించారు.

13న ఉపకరణాల గుర్తింపు శిబిరం

పుట్లూరు : బుక్కరాయసముద్రం మండల కేంద్రంలోని పెద్దమ్మ గుడి సమీపంలోని ఎంపిపిఎస్ పాఠశాల ప్రాంగణంలో ఈనెల 13వతేదీన జిల్లా దివ్యాంగ, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక గుర్తింపు శిబిరం నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ అలివేలమ్మ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వైద్య పరిశీలన ఆధారంగా అవసరమైన దివ్యాంగ, వయోవృద్ధులకు సహాయ పరికరాలు అందించేందుకు లబ్ధిదారులను ఎంపిక చేయనున్నటన్లు తెలిపారు. ఈ అవకాశాన్ని దివ్యాంగ, వయో వృద్ధులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

20 బెంచీలు వితరణ

అనంతపురం : నగరంలోని మొదటి రోడ్డులో ఉన్న పొట్టి శ్రీరాములు పాఠశాలకు పూర్వ విద్యార్థులు 20 బెంచీలను వితరణ చేశారు. పాఠశాల ఆవరణలో 1976-77లో విద్యనభ్యసించిన పూర్వ విద్యార్థులు పాఠశాల ప్రధానోపాధ్యాయుని శ్రీదేవి అధ్యక్షత సమావేశమయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులు అంతా కలిసి 20 బెంచీలన వితరణ చేవారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు ఇఫ్తేకార్, తులసిరెడ్డి, పూర్వ విద్యార్థులు మనోహర్, హరినాథ్, దీక్షిత్, వన్నప్ప, శ్రీనివాసులు, మహబూబ్‌బాషా, సలీంబాషా, వెంకట్రామిరెడ్డి, మల్లికార్జున, శ్రీనివాస్ రావు, రామిరెడ్డి, షేక్ రియాజుద్దీన్ పాల్గొన్నారు.

మొక్క నాటి అమ్మను గౌరవించుకోండి

అనంతపురం: ప్రతి ఒక్కరూ తమ మాతృమూర్తి పేరుతో మొక్కలు నాటి అమ్మను గౌరవించుకోవాలని ఎస్‌వి డిగ్రీ, పిజి కళాశాల ప్రిన్సిపాల్ ఎన్ఎవి ప్రసాద్ పిలుపునిచ్చారు. ఏక్ పేడ్ మాకే నామ్ పిలుపు మేరకు స్థానిక ఎస్‌వి కళాశాలలో ఎస్వీ డిగ్రీ, పిజి కళాశాల వైస్‌ఛైర్మన్ సి.చక్రధరరెడ్డి ఆధ్వర్యంలో కళాశాల ప్రిన్సిపాల్ తన మాతృమూర్తి పేరుతో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్మ మనల్ని ఎలా పెంచి పెద్ద చేసిందో.. అదేతరహాలోనే తాము నాటిన మొక్కను సంరక్షించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఐక్యూఎసి కోఆర్డినేటర్ ఎ.శ్రీనాథ్, జాతీయ సేవా పథకం అధికారులు జి.ఆనంద్‌బాబు, టి.సుదర్శన్‌రెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

హజరత్ సయ్యద్ ముస్తఫా షా ఖాద్రీ ఉరుసు

యాడికి : మండల కేంద్రంలోని హజరత్ సయ్యద్ ముస్తఫాషా ఖాద్రీ ఉరుసు మహోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముస్తఫా షా ఖాద్రీ వంశీకులు షేక్షావలి, వెంకట దుర్గాప్రసాద్, సుభాన్, ఓబుల్‌రెడ్డి, నాగేంద్రరావు, రామాంజనేయులు, దాదా ఖలందర్, హిందూ, ముస్లిములు పాల్గొన్నారు.

ఐసిడిఎస్ సిడిపిఒగా చల్లా లలిత



శింగనమల : మండల ఐసిడిఎస్ ప్రాజెక్టు సిడిపిఒగా చల్లా లలిత గురువారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ విధులు నిర్వహించిన ఉమా శంకరమ్మ బదిలీపై అనంతపురం రూరల్‌కు వెళ్లారు. ఆమె స్థానంలో అనంతపురం అర్బన్ సిడిపిఒగా పనిచేస్తున్న లలిత మండల సిడిపిఒగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శింగనమల ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో ఉన్న అంగన్వాడీ కేంద్రాల్లో పని చేస్తున్న సిబ్బంది సక్రమంగా విధులు నిర్వహించాలన్నారు. ఎవరైనా విధులు సక్రమంగా నిర్వర్తించకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు.

విద్యార్థులకు బ్యాగులు పంపిణీ

అనంతపురం సిటీ : నిత్యసురభి ఛారిటబుల్ ట్రస్టు, పుట్టినిల్లు ఆశ్రమం ఛైర్‌పర్సన్ ఎస్.నిర్మలమురళి ఆధ్వర్యంలో విద్యార్థులకు గురువారం బ్యాగులు పంపిణీ చేశారు. ఇందులో భాగంగా దాదాపు 22 మంది చిన్నారులకు బ్యాగులతోపాటు చాక్లెట్లు, జ్యూస్ ప్యాకెట్ అందించారు. ఈకార్యక్రమంలో ట్రస్టు సభ్యులు లలిత, భవిత, తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ

యాడికి : పాఠశాల ప్రారంభమైన తొలిరోజునే మండల పరిధిలోని సి.లక్షుంపల్లి పాఠశాలలో మధ్యాహ్న భోజన వసతిని టిడిపి సీనియర్ నాయకులు చలమారెడ్డి గురువారం తనిఖీ చేశారు. ఇందులో భాగంగా పాఠశాలకు అందుతున్న సన్నబియ్యం నాణ్యతను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధి, విద్యా ప్రమాణాలపై ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట టిడిపి యువ నాయకుడు రవికుమార్‌రెడ్డి ఉన్నారు

నేరాలు ఘోరాలు

చికిత్స పొందుతూ మృతి

గుత్తి : రెండు రోజుల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు గుత్తి ఆర్ఎస్ లోని రామాలయం వీధికి చెందిన చంద్రశేఖర్ (48) ఈనెల 10న గుత్తి ఆర్ఎస్ నుంచి పట్టణానికి పని నిమిత్తం ద్విచక్రవాహనంలో బయలుదేరాడు. చంద్రప్రియ నగర్ వద్ద ఉన్న వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహం సమీపంలోని రహదారిపై ద్విచక్రవాహనం అదుపుతప్పి బోల్తా పడింది. దీంతో తీవ్రంగా గాయపడిన బాధితుడిని చికిత్స నిమిత్తం స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో బెంగళూరులోని ఓ ప్రయివేట్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ ఆయన మరణించాడు. మృతుడికి భార్య, పిల్లలు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

67 గొర్రెలు మృత్యువాత

పెద్దపప్పూరు : కడుపు ఉబ్బరం వచ్చి మూగజీవాలు మృతిచెందిన ఘటన బుధవారం రాత్రి మండల పరిధిలోని చిన్నయక్కలూరు గ్రామంలో చోటుచేసుకుంది. గొర్రెల కాపరి కంబన్న తెలిపిన వివరాల మేరకు.. రోజూ మాదిరిగానే బుధవారం మేతకు వెళ్లి తిరిగి రాత్రి కళ్లం దొడ్డో తోలినట్లు తెలిపారు. తర్వాత ఉన్నట్లుండి కడుపు ఉబ్బరంగా వచ్చి మృత్యువాత పడ్డాయని వాపోయాడు. మొత్తం 87 జీవాలు ఉండగా 67 మరణించినట్లు తెలిపారు. వీటి విలువ సుమారు రూ.5లక్షల వరకూ నష్టం సంభవించిందన్నారు. విషయం తెలుసుకున్న వైద్యులు సుబ్బారెడ్డి శవ పరీక్ష చేసి నివేదిక తయారు చేసి పంపుతామని తెలిపారు.